# నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

3 | నిజామాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 | KAMAREDDY




దవాఖానలో చికిత్స పొందుతున్న అనీఫ్ తల్లిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

## ఎల్లారెడ్డిలో రౌడీల పాలన

**కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి**

రామారెడ్డి, నవంబర్ 16 : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రౌడీల పాలన కొనసాగుతున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మండలంలోని రంగంపేటకు చెందిన మహ్మద్ అనీఫ్ కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, తన ఫొటోలను వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నందుకు కాంగ్రెస్ కార్యకర్త అనీఫ్‌పై ఎమ్మెల్యే మదన్‌మోహన్ అనుచరులు శుక్రవారం దాడి చేసి, ఆయన కుటుంబాన్ని బెదిరించారన్నారు. దీంతో అతడి తల్లి గుండెపోటుకు గురయ్యారన్నారు. దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, నీ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడారని ఎమ్మెల్యేను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నిన్ను ఎందుకు గెలిపించామని ఎల్లారెడ్డి ప్రజలు ఇప్పుడు బాధ పడుతున్నారని తెలిపారు. మదన్‌మోహన్ ఒంటెద్దు పోకడలతోనే అసెంబ్లీ కన్నా పార్లమెంట్ ఎన్నికల్లో 40 వేల మెజారిటీ తగ్గిపోయిందన్నారు. బ్యానర్లు, ఫ్లెక్సీల్లోని ఫొటోలపై రాజకీయం చేయడం మానుకుని.. ఎల్లారెడ్డిలో పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టిపెట్టాలని మదన్‌మోహన్‌కు సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఫలితం అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



కామారెడ్డిలోని సాందీపని కళాశాలలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

## 'గ్రూప్-3' కి సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- గంట ముందే గేట్లు క్లోజ్

కామారెడ్డి/కంఠేశ్వర్/ఖలీల్‌వాడి, నవంబర్ 16: గ్రూప్-3 పరీక్షలకు ఉమ్మడి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న పరీక్షలకు నిజామాబాద్ జిల్లాలోని 66 కేంద్రాల్లో 19,941 మంది అభ్యర్థులు, కామారెడ్డి జిల్లాలోని 20 కేంద్రాల్లో 8,268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండు పరీక్షలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం సెషన్‌లో మరో పరీక్ష ఉంటుందని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా మూడు కేంద్రాలకు ఒకరు చొప్పున 22 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు వీలైనంత త్వరగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిర్దేశిత సమయానికంటే గంట ముందు నుంచే లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆర్మూర్ వైపు నుంచి వచ్చే అభ్యర్థులు అడవి మామిడిపల్లి వద్ద ఆర్‌యూబీ పనుల నేపథ్యంలో వాహనాల మళ్లింపును దృష్టిలో ఉంచుకుని ముందుకు రావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ, ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ తెలిపారు. సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలన్నారు.



అలంకరణలో ఉత్సవమూర్తులు



సుదర్శన చక్రానికి స్నాన ప్రక్రియను నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

## వైభవంగా శ్రీవారి చక్రస్నానం

భీమ్‌గల్, నవంబర్ 16 : మండలకేంద్రంలోని నింబాచల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు శనివారం అర్చకులు స్వామివారికి చక్రస్నానం, శేషహోమం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో పుష్కరిణి వరకు మంగళవాయిద్యాల మధ్య తీసుకువచ్చి, స్వామివారి ఎదుట పంచ కలశాలను ప్రతిష్ఠింపజేశారు. వివిధ జలాలతో ఉత్సవమూర్తులకు స్నాన ప్రక్రియ నిర్వహించారు. మంగళప్రదమైన హరిద్రాఘృత్రాన్ని భక్తుల శిరస్సుపై చల్లారు. అర్చకులు శ్రీభాగవత పారాయణం చేస్తుండగా సుదర్శన చక్రానికి పుష్కరిణిలో స్నానమాచరింపజేశారు. అనంతరం పుష్పయాగాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన లంబాడాలు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నట్లు అర్చకులు తెలిపారు.



## ఉద్యానక్షేత్రం అంతులేని నిర్లక్ష్యం

- అడవిని తలపిస్తున్న మాల్తుమ్మెద
- తుప్పు పడుతున్న ట్రాక్టర్లు, యంత్రాలు
- వృథాగా పోతున్న రూ.కోట్ల విలువైన సంపద
- అరుదైన పండ్ల తోటలు కనుమరుగు
- అధికారులు కనిపించరు.. దినసరి కూలీలే క్షేత్ర పాలకులు
- ఏడాదిగా ఒక్క రూపాయీ ఇవ్వని సర్కారు

నాగిరెడ్డిపేట, నవంబర్ 16: అందమైన చెట్లు.. అరుదైన పండ్ల మొక్కలతో ఉమ్మడి రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన మాల్తుమ్మెద ఉద్యాన వన క్షేత్రం నేడు అంతులేని నిర్లక్ష్యానికి గురవుతున్నది. రేవంత్ సర్కారు ఒక్క రూపాయీ కూడా విదల్చక పోవడంతో పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్నది. బోధన్-హైదరాబాద్ రహదారిని ఆనుకుని 61 ఎకరాల్లో విస్తరించిన ఉద్యాన క్షేత్రంపై పర్యవేక్షణ లేకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే యంత్రాలు, మిస్ట్ చాంబర్లు, ట్రాక్టర్లు తుప్పు పడుతున్నాయి. అరుదైన పండ్ల తోటలు, ఉసిరి, దానిమ్మ, ఆపిల్ బేర్, కరివేపాకు తోటల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఆనవాళ్లు లేకుండా పోయాయి. అంటుమొక్కల కోసం వేసిన గ్రీన్‌షెడ్ నెట్‌లు చిరిగి పోయి వేలాడుతున్నాయి.

### నాడు అగ్రగామిగా..

నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద శివారులో 40 ఏండ్ల క్రితం ఉద్యాన వనక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మామిడి సహా ఇతర పండ్ల తోటల పెంపకంతో పాటు అంటు మొక్కల ఉత్పత్తిలో ఈ క్షేత్రం ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడ ఒక ఏడీఏ, ఇద్దరు ఉద్యాన అధికారులు (హెచ్‌వో), ఇతర సిబ్బంది కలిపి 12 మంది వరకు పని చేసే వారు. నిత్యం 100 మందికి పైగా కూలీలతో అంటు మొక్కల ఉత్పత్తి జరిగేది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా ఈ క్షేత్రానికి వచ్చి సేద తీరేవారు అంటే ఇక్కడ ఏ స్థాయిలో ఆహ్లాదంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

### నేడు కళావిహీనంగా..

ఒకనాడు రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిన మాల్తుమ్మెద క్షేత్రం సర్కారు నిర్లక్ష్యంతో ప్రస్తుతం కళావిహీనంగా మారింది. పట్టించుకునే వారు లేకపోవడంతో అరుదైన పండ్లతోటలు కనుమరుగవుతున్నాయి. ఇక్కడ 30 ఎకరాల్లో పాత మామిడితోట ఉండగా, రెండేండ్ల క్రితం మరో ఐదెకరాల్లో అరుదైన మామిడి తోటలను సాగుచేశారు. ఎకరం విస్తీర్ణంలో పాత జామ తోట ఉండగా, మరో ఐదెకరాల్లో తైవాన్‌జామ, ఇంకో ఐదెకరాల్లో లక్నో 49 రకం నాటారు. రెండెకరాల్లో ఉసిరి తోట, ఆయిల్‌ఫామ్ నాటారు. నాలుగు ఎకరాల్లో ఆపిల్‌బేర్ ఉండగా, రెండు ఎకరాలను తొలగించి మామిడితోటగా మార్చారు. నాలుగు ఎకరాల్లో దానిమ్మ సాగుచేయగా పర్యవేక్షణ లేక ఎండిపోయింది. వీటితో పాటు సర్వ్ చెట్లు, కరివేపాకు తోట, అల్లనేరేడు, టేకు చెట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అవన్నీ ఆలనాపాలన లేక అవసాన దశకు చేరాయి.



ఉసిరి తోట దుస్థితి

### మూలనపడ్డ ట్రాక్టర్లు, యంత్రాలు..

అధికారుల పర్యవేక్షణ లేక ఉద్యాన క్షేత్రం అడవిగా మారింది. పచ్చని తోటల నడుమ అందమైన దారులతో కనువిందు చేసిన ఈ క్షేత్రం ఇప్పుడు గడ్డి, పిచ్చి మొక్కలతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితికి చేరింది. ఆర్నెళ్లుగా పని చేసే వారు లేక, పట్టించుకునే వారు లేక రూ.కోట్ల విలువైన యంత్రాలు, ట్రాక్టర్లు, యంత్రాలు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. సిబ్బందికి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు కేసీఆర్ హయాంలో 2017లో రూ. 16 లక్షలతో 10 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక ఒక్కటి కూడా పనిచేయడం లేదు.



వృథాగా మారిన ట్రాక్టర్లు

### పట్టించుకునే వారేరి?

ఇక్కడ ఉద్యాన అధికారిగా పని చేసిన రామకృష్ణ మూడు నెలల క్రితం కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన కమలాకర్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. జిల్లా కేంద్రంలోనే ఉంటూ ఏదో చేసుకుని ఉద్యోగోన్నతిపై కరీంనగర్‌కు వెళ్లిపోయారు. దీంతో సదాశివనగర్ హెచ్‌వో హర్షవర్ధన్‌కు మాల్తుమ్మెద ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆయన కూడా ఇటువైపు రావడం లేదు. అధికారులు, సిబ్బంది లేక పర్యవేక్షణ కరువైంది. ఇక్కడ దినసరి కూలీలుగా పని చేస్తున్న రాంచందర్, నవీన్‌లే ఉద్యాన క్షేత్రానికి పెద్దదిక్కుగా మారారు.



క్షేత్రంలో దారి ఇలా..



వృథాగా మారిన గ్రీన్‌షెడ్ నెట్, చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

**నిధుల్లేవు.. పనుల్లేవు**

ఇక్కడ పని చేసిన హెచ్‌వో కమలాకర్ బదిలీపై వెళ్లడంతో ఇటీవలే నాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఏడాది కాలంగా క్షేత్రానికి నిధులు రాలేదు. దీంతో ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేక పోతున్నాం. నిధులు వస్తే పనులు మొదలెడతాం.

**- హర్షవర్ధన్, ఇన్‌చార్జి హెచ్‌వో, మాల్తుమ్మెద ఉద్యాన వన క్షేత్రం**

### కేసీఆర్ హయాంలో పూర్వవైభవం..

కేసీఆర్ ప్రభుత్వం మాల్తుమ్మెద క్షేత్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది. 2016లో రూ.1.36 కోట్లు మంజూరు చేసి అన్ని వసతులు కల్పించింది. నూతన గదులు, గ్రీన్‌షెడ్ నెట్‌లు, మిస్ట్ చాంబర్, ట్రాక్టర్లు, యంత్రాల కొనుగోలుతో పాటు నూతన తోటలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై ఇక్కడ శిక్షణను సైతం ఇప్పించారు. ప్రభుత్వం మారడంతో ఉద్యాన క్షేత్రం నిర్లక్ష్యానికి గురైంది. నేడు ఆలనాపాలన లేక అంధకారంలోకి చేరుకున్నది. ఈ ఏడు ఒక్క మొక్క కూడా ఉత్పత్తి చేయలేదు. కనీసం అక్కడి గడ్డిని కూడా తొలగించలేదు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన గ్రీన్‌షెడ్ నెట్‌లు, మిస్ట్ చాంబర్ వృథాగా మారాయి. వాటిని వినియోగించక పోవడంతో శిథిలావస్థకు చేరాయి. క్షేత్రంలోని పండ్ల తోటలు, అంటు మొక్కల కోసం తెచ్చిన ఎరువులు 5 నెలలుగా అక్కడి గదుల్లోనే మూలుగుతున్నాయి. సకాలంలో వాటిని వినియోగించకపోవడంతో అవి వృథాగా మారుతున్నాయి.



- నిద్దరోతున్న తూనికలు, కొలతల శాఖ
- మాచారెడ్డి ఘటనతో అప్రమత్తమయ్యేనా?
- పలుచోట్ల నిర్వహణ తీరులో లోటుపాట్లు
- ధాన్యం కొనుగోళ్ల వేళా పట్టించుకోని వైనం
- గతంలో నిజాంసాగర్, గాంధారిలోనూ మోసాలు
- రైతులు నష్టపోతున్నా పట్టించుకోని యంత్రాంగం

## అధర్మ కాంటాలు

నిజామాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అటు ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇటు వ్యాపారుల దోపిడీ పర్వం మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తరుగు పేరిట మిల్లర్లు అన్నదాతల శ్రమను దోచుకుంటుండగా, మరోవైపు కాంటాల రూపంలోనూ కర్షకులను ముంచుతున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో ధర్మకాంటాల్లో జరుగుతున్న అక్రమాలు బయటపడుతున్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారులు నిద్దరోతుండడం, తనిఖీల సంగతే మరవడంతో రైతులకు నష్టం వాటిల్లుతున్నది.

### పట్టించుకునే వారేరి?

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణపై ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. గతంలో పంట కోతకు వస్తున్న తరుణంలోనే యంత్రాంగం అప్రమత్తమయ్యేది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేసీఆర్ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టేది. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటుగా అధికార యంత్రాంగం రంగంలోకి దిగేది. రైస్‌మిల్లర్లు, ప్రైవేటు వర్తకులు, లారీల యజమానులు, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, రవాణా, తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ ఇలా ధాన్యం కొనుగోళ్లతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరితో తరచూ సమీక్షలు జరిగేవి. కానీ ఇప్పుడు అంతటి శ్రద్ధ కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి లేకపోవడంతో ఉభయ జిల్లాలను పట్టించుకునే వారే కరువయ్యారు. ఇన్‌చార్జి మంత్రి చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుండా పోయింది. కొత్తకొత్త సమస్యలు వెలుగు చూస్తుండగా, శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

### తూనికలు కొలతల శాఖ ఏం చేస్తున్నట్లు..?

రెండ్రోజుల క్రితం మాచారెడ్డి మండలంలోని ధర్మకాంటలో లోటుపాట్లు వెలుగు చూడడం ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపింది. ధాన్యం బరువు విషయంలో రైతులకు అనుమానాలు రావడంతో అక్రమ దందా బయటపడింది. కొత్తపల్లి గ్రామంలో సేకరించిన 741 బస్తాల వడ్లను పాల్వంచలోని ఓ రైస్‌మిల్లుకు చేర్చారు. అక్కడ ధర్మకాంట లేకపోవడంతో చుక్కాపూర్‌లోని ధర్మకాంటపై బరువును కొలిచిన అనంతరం రైస్‌మిల్లుకు తరలించారు. ధర్మకాంట వద్ద తీసిన బరువు చీటితో, కొనుగోలు కేంద్రంలోని ధాన్యం బస్తాల రసీదులను రైతులు పోల్చి చూశారు. తూకంలో తేడాలు రావడాన్ని గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తూనికలు, కొలత శాఖ అధికారి సుధాకర్ నేతృత్వంలోని బృందం వచ్చి తనిఖీలు చేపట్టగా ధర్మకాంటలో తేడాలు బయట పడడంతో రూ.10వేలు జరిమానా విధించారు. అయితే, ఈ వ్యవహారంతో ప్రభుత్వ వైఫల్యం బయటపడిందని రైతులు విమర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు ముందే అన్ని ధర్మకాంటాలను తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో గతంలోనూ ఈ తరహా మోసాలు బయట పడ్డాయి. గాంధారి మండలంలోని జువ్వాడిలో, నిజాంసాగర్ మండలం కోమలాంచలోనూ రైస్‌మిల్లుల తూకం యంత్రాల్లో లోపాలు గుర్తించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టక పోవడం గమనార్హం.

### తనిఖీలు చేస్తేనే సరి...

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో దాదాపుగా 400 రైస్ మిల్లులు సీఎంఆర్‌కు ముందుకొచ్చాయి. ధాన్యం కొనుగోళ్ల అనంతరం కేంద్రాల నుంచి మిల్లులకు చేర్చుతున్నారు. ఈ క్రమంలో తూకాల్లో తేడాలు రైతులను ముంచుతున్నాయి. కొన్నిచోట్ల మిల్లర్లు తప్పులు చేస్తూ దండుకుంటుండగా, మరి కొన్ని చోట్ల ధర్మకాంటలో లోపాలు సైతం అన్నదాతలకు శాపంగా మారాయి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో కర్షకుల రెక్కల కష్టం అక్రమార్కుల పరమవుతున్నది. కామారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖకు ఇన్‌చార్జి అధికారి పని చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల తనిఖీలు చేపట్టకపోవడంతో పాటుగా పర్యవేక్షణ లోపాల విషయంలో అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. లారీ డ్రైవర్లు రైతుల నుంచి బస్తాకు రూ.1 చొప్పున దోపిడీ చేస్తున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ స్పందించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## తరుగు పేరిట దోపిడీ

- విచ్చలవిడిగా కోతలు
- బెదిరిపోతున్న అన్నదాతలు



నరేశ్‌కుమార్, రైతు, బొంకన్‌పల్లి

మాక్లూర్, నవంబర్ 16 : ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల చిల్లర వేషాలు ఆగడం లేదు. తరుగు పేరిట ఎక్కడికక్కడ దోచుకుంటున్న ఉదంతాలు బయటకొస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటను బొక్కేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో ఇదేం దోపిడీ అంటూ మండిపడుతున్నారు. ఒకటి, రెండు కాదు, ఏకంగా 13 క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట కొట్టేశారని మాక్లూర్ మండలం బొంకన్‌పల్లికి చెందిన రైతు నరేశ్‌కుమార్ శనివారం వాపోయారు. అసలేం జరిగిందంటే.. ఈ నెల 7న ధాన్యం కాంటా వేసి, 765 బస్తాలను కాలూర్ శివారులోని ఓ రైస్‌మిల్‌కు పంపించారు. అయితే, తరుగు పేరిట 33 బస్తాలను తగ్గించారని నరేశ్ తెలిపారు. ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతే కాంటా వేశారని, తీరా రైస్ మిల్‌కు వెళ్లిన వారం రోజుల తర్వాత తరుగు పేరుతో 13 క్వింటాళ్లు తగ్గించారన్నారు. దీంతో తనకు 30 వేల నష్టం వాటిల్లిందని విలేకరులతో తన ఆవేదనను వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో తన లాంటి రైతులెందరో నష్టపోతున్నారని, ఇప్పటికైనా స్పందించి మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని కోరారు.



గ్రంథాలయం వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో జిల్లా జడ్జి సునీత కుంచాల

## ఓటమిని ఒప్పుకోవద్దు

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- పదేండ్లు కష్టపడితే ఈ స్థాయికొచ్చా..

ఖలీల్‌వాడి, నవంబర్ 16 : పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఓటమిని ఒప్పుకోవద్దని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. ఒక ప్రయత్నంలో ఉద్యోగం రాకపోతే వెనుకంజ వేయకుండా మళ్లీ ప్రయత్నించాలని, గమ్యం చేరేదాకా వదలొద్దన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలో ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి తన అనుభవాలను వివరించారు. 2003 నుంచి 2013 పదేండ్ల పాటు కష్టపడ్డానని, దాదాపు 9 నోటిఫికేషన్లలో సాధించకపోయినా పదో నోటిఫికేషన్‌లో సాధించి, జిల్లా జడ్జిగా నియామకమైనట్లు చెప్పారు.


16వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...

Chandrashila CHILD CARE HOSPITAL

చంద్రశిల పిల్లల ఆసుపత్రి

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా, ఖలీల్‌వాడి, నిజామాబాద్

సెల్ : 8985 257712, 7036211849, ఫోన్ : 08462 -224422

నేడు మా హాస్పిటల్ 16వ వార్షికోత్సవం సందర్భంగా మిత్రులకు, శ్రేయోభిలాషులకు మాతో సహకరించిన ప్రతి ఒక్కరికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు...

డా॥ పి.ఆనంద్ MD (Pediatrics) Childrens & New Born Specialist

డా॥ పి.నీలిమా MS (OBGY) Ladies Specialist

అభినందనలతో...

చంద్రశిల మెడికల్ & ఫార్మసీ

ఖలీల్‌వాడి, నిజామాబాద్